17వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
శుక్రవారం మే 15 2026 పేజీలు 8

## తూకంలో జాప్యం... రైతుల్లో ఆందోళన..

◆మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



**చురకలు విలేకరి, రాయికల్, మే 14 :** ఆరు కాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తెచ్చిన ధాన్యం తూకం వేయడంలో జాప్యం ఏర్పడి రైతులు ఆందోళన చెందుతున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం రాయికల్ మండలం వడ్డే లింగాపూర్,చింతలూర్, కొత్తపేట్,మూటపల్లి గ్రామాలలో మొక్కజొన్న,వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తూకంలో జాప్యం లారీల కొరతపై జీవన్ రెడ్డి అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని -2లో

### పి ఎం జె జ్యువెలరీ షాప్ దోపిడీ కేసులో
## కరుడుకట్టిన అంతర్ రాష్ట్ర దోపిడీ ముఠా అరెస్ట్

◆సీపీ గౌస్ ఆలం



**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, మే 14 :** కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన దొంగతనం కేసును కరీంనగర్ పోలీసులు ఎట్టకేలకు చేధించారు.గురువారం అస్త్ర కన్వెన్షన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో సీపీ వివరాలు వెల్లడించారు. సందర్భంగా సిపి మాట్లాడుతూ,మే 3న కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పిఎంజె జ్యువెలరీ షాపులో జరిగిన ఈ దోపిడీలో 161.4తులాల బంగారు ఆభరణాలు,112క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి మొత్తం రూ.82,02,000/- విలువైన ఆభరణాలు దోచుకెళ్లబడింది. ఈ ఘటనలో నలుగురు స్టాఫ్ గాయపడ్డారు.ఈ ఆపరేషన్‌ను ప్రస్తుతం బీహార్ జైలులో ఉన్న అంతర్రాష్ట్ర గ్యాంగ్ హ్యాండ్లర్ మరియు "ది గోల్డెన్ థీఫ్" గా పేరొందిన సుభోద్ సింగ్ ప్రణాళికా బద్ధంగా నిర్వహించాడు. ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను 13-05-2026న సాయంత్రం 4:00 గంటల సమయంలో వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు నిందితులు రవీష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ మరియు మెహతాబ్ ఖాన్‌లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకు వచ్చారు.రఘునాథ్ కర్మాకర్ విచారణ లో బీహార్ మరియు బెంగాల్ కేంద్రం గా పనిచేస్తున్న అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా గురించి కీలక సమాచారం బయటపడింది. ఈ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జ్యువెలరీ షాపులు మరియు బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది."ది గోల్డెన్ థీఫ్"గా పేరొందిన సుభోద్ సింగ్ నాయకత్వం లో ఈ గ్యాంగ్ ఏర్పడినట్లు విచారణలో తేలింది. ఈ ముఠా ముందస్తుగా రేక్కీ నిర్వహించడం, నేరము చేసిన తరువాత తప్పించుకునే మార్గాలను గుర్తించడం, నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు ఉపయోగించడం, తప్పుడు పేర్లతో లాడ్జ్‌లలో ఉండడం, ఆధునిక సాంకేతికత వినియోగించడం వంటి పద్ధతులతో ఆయుధాలతో దోపిడీలు నిర్వహించేది.సుభోద్ సింగ్ మరియు అతని అనుచరుల ప్రణాళిక ప్రకారం కింది నిందితులు తెలంగాణకు రెండు నెలల క్రితం వచ్చారు:రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్ రవీష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ రాధే అలియాస్ అభయ్ అలియాస్ ప్రమోద్ గోస్వామి మిశ్రా సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్ తెలంగాణలోకి ప్రవేశించే ముందు వీరు జార్ఖండ్-పశ్చిమ బెంగాల్ సరిహద్దులో మెహతాబ్ ఖాన్ వద్ద ఒక్కో సిమ్ కార్డును రూ.10,000 చొప్పున కొనుగోలు చేశారు. అనంతరం వీరు ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ జ్యువెలరీ షాపులు,బ్యాంకుల పై రేక్కీ నిర్వహించారు.చివరకు కరీంనగర్‌లోని పిఎం జె జ్యువెలరీ షాప్‌ను లక్ష్యంగా ఎంచుకుని పెద్దపల్లిలోని ఒక లాడ్జ్‌లో బస చేశారు. 01-05-2026 రోజున ధర్మపురిలోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌కు మారి దోపిడీకి -2లో

### కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్లే
## తెలంగాణ రైతులకు నష్టం



◆ఎంపీ అరవింద్‌తో కేంద్ర మంత్రిని కలిసిన నిధుల కేటాయింపు శూన్యం
◆మద్దతు ధర ప్రకటించి కేంద్రం చేతులెత్తేసింది నిందలు వేయడం కాదు.. స్థల సేకరణకు ప్రయత్నించాలి
◆జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

చురకలు విలేకరి, రాయికల్,మే 14 : కేంద్రం ప్రభుత్వ సన్నిహిత రాష్ట్రాలు మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో సైతం కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని, కేంద్ర ప్రభుత్వ ఆసమర్ధ వైఖరి వల్లే తెలంగాణ రైతులకు నష్టం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.గురువారం రాయికల్ పట్టణం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చల్ గల్ లో విద్యాసంస్థలకు స్థలం విషయంలో పలుమార్లు -2లో

## ధాన్యం అన్లోడింగ్లో నిర్లక్ష్యం చేయవద్దు

◆రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
◆జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 14 :** ధాన్యం అన్లోడింగ్లో నిర్లక్ష్యం చేయవద్దని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం మల్లాపూర్ మండలం రాఘవ పేట, ముత్యం పేట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మొగిలి పేట గ్రామంలోని ఏఆర్ఎస్ రైస్ మిల్, ముత్యం పేట, రాఘవపేట గ్రామం లోని పూజ ఇండస్ట్రియల్ రైస్ మిల్లు, విష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. రాష్ట్రంలో మరియు జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల -2లో

### నూతన గోడౌన్ల నిర్మాణానికి
## కార్యాచరణ సిద్ధం చేయాలి

◆జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
◆ఎఫ్ సీఐ,ఎస్ డబ్ల్యూసీ, నాబార్డ్, పరిశ్రమల శాఖ, తహసీల్దార్లు ఇతర శాఖల అధికారులతో సమీక్ష



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, మే 14 :** జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ సీఐ), స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్ డబ్ల్యూసీ), నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ -2లో

## ప్రభుత్వ సలహాదారు విహెచ్ హనుమంతరావును కలిసిన "ఆది"



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 14 :** ప్రభుత్వ సలహాదారుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విహెచ్ హనుమంతరావు గురువారం పదవి బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గురువారం కలిసి శాలువా కప్పి హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## సాదా సీదాగా...సరదాగా కాసేపు....




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 14 :** సాధారణంగా రాజకీయ నాయకులు ప్రజల్లోకి వస్తే ఎప్పుడు బిజీగా గడుపుతారు.ఇక ప్రతిపక్ష హోదా ఉంటే మాత్రం క్షణం తీరిక ఉండదు... ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉండాల్సి ఉంటుంది... కొద్దిసేపు ఎక్కడైనా సరదాగా ఉండేందుకు ప్రయత్నించినా సమయం దొరకదు. కానీ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కాసేపు సరదాగా స్థానిక నాయకులతో ముచ్చటించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి వచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఇలా స్థానిక అంబేద్కర్ చౌరస్తా లోని సయ్యద్ కేఫ్ లో సాధారణ వ్యక్తుల టీ తాగుతూ ముచ్చటించారు.


## నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...** సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఎస్ డబ్ల్యూసీ, ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## తూకంలో జాప్యం... రైతుల్లో ఆందోళన..

**మొదటి పేజీ తరువాయి...**సూచించారు.లారీ ట్రాన్స్ పోర్ట్ వారితో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో 40 శాతం కూడా ధాన్యం తూకం కాలేదు అని లారీలతో పాటు అమాలి సమస్య ధాన్యం తూకం లేక అమాలికి పని లేక వారు ఉండటం లేదని పేర్కొన్నారు.అధికారులు పర్యవేక్షించి కొనుగోలు కేంద్రాలు ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపి రాజారెడ్డి, కొయ్యేడి మహిపాల్ రెడ్డి,బర్గం మల్లేష్,తురగ శ్రీధర్, రమేష్, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా రక్తదానం




**చురకలు వీలేఖరి,జగిత్యాల, మే, 14** గుర్తుగా, తన స్నేహితురాలి పుట్టినరోజును ప్రత్యేకంగా గుర్తుండేలా చేసేందుకు రిపోర్టర్ సాయికుమార్ వినూత్నంగా రక్తదానం చేశారు. కేక్ కట్ చేయడం కంటే రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటం గొప్ప బహుమతిగా భావిస్తూ జగిత్యాల సివిల్ హాస్పిటల్‌లో రక్తదానం చేశారు.ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ, "పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవడం సాధారణమే కానీ, రక్తదానం ద్వారా పలువురికి ప్రాణదాతలమవ్వడం నిజమైన మానవత్వం. నా స్నేహితురాలి పుట్టినరోజు ఎప్పటికీ గుర్తుండేలా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నాను" అని తెలిపారు.ఆయన చేసిన ఈ మంచి కార్యక్రమాన్ని ఆసుపత్రి సిబ్బంది, స్నేహితులు అభినందించారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

# కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్లే తెలంగాణ రైతులకు నష్టం

**మొదటి పేజీ తరువాయి...** ఇరిగేషన్ శాఖ మంత్రికి విన్నవించి జగిత్యాల పరిసర ప్రాంతాల్లో సరైన స్థలాన్ని గుర్తించానని ఎంపీ అరవింద్ తనపైన తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.జిల్లా కేంద్రంలో పేద మధ్యతరగతి పిల్లలకు ఉపయోగపడే నవోదయ పాఠశాలను కోరుట్ల కు తరలించడం ఏంటని ప్రశ్నించారు.గతంలో ఎంపీ అరవింద్ తో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రులు జోలో ఓరం ,దుర్గా దాస్ లను కలిసి బోర్నపల్లి జగన్నాథ్ పూర్ బ్రిడ్జి మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేయగా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని తెలిపారు.జగిత్యాల మండలం చల్గల్ కేంద్రీయ విద్యాలయానికి స్థలం విషయంలో ఎంపీ అరవింద్ ఇరిగేషన్ శాఖ మంత్రి తో వారికున్న సత్సంబంధాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించకపోగా ప్రశ్నించడం ఏంటని మండిపడ్డారు.చల్గల్ లో ఎంపీ అరవింద్ మద్దతుగా ఉన్న రైతులే అక్కడ కేంద్రీయ విద్యాలయం వద్దని నిరసన తెలిపారన్నారు.ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి,జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం చలిగల్ లో విద్యాసంస్థల ఏర్పాటుకు పూర్తి సానుకూలంగా ఉన్నారన్నారు.కేంద్రీయ విద్యాలయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అడ్మిషన్లు వచ్చిన తర్వాతనే ఇతరులకు కేటాయిస్తారని తెలిపారు.జగిత్యాల ధర్మపురి, జగిత్యాల రాయికల్, జాతీయ రహదారుల వంతెనలు నిర్మాణం కోసం పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన ఫలితం మాత్రం శూన్యమని వాపోయారు.కేంద్ర ప్రభుత్వం వరి, మొక్కజొన్న లకు మద్దతు ధర గొప్పగా ప్రకటించిన చేతల్లో మాత్రం రైతులకు మద్దతు లేదని మొక్కజొన్న కొనుగోలుతో ప్రతి క్వింటాలకు వెయ్యి రూపాయలు రాష్ట్రం నష్టాన్ని భరిస్తుంది.మొక్కజొన్న వరి కొనుగోలు తో మార్క్ ఫెడ్,సివిల్ సప్లై కార్పొరేషన్లు నష్టాల్లో ఉందన్నారు.గత ఏడాది రాయికల్ లో 2266 మెట్రిక్ టన్నులు 839 మంది రైతుల వద్ద కొంటే నేడు ఇప్పటి వరకు 4290 మెట్రిక్ టన్నులను 1170మంది రైతుల వద్ద కొనుగోలు చేయగా, జగిత్యాలలో గత ఏడాది 487 మంది రైతుల వద్ద 1150 మెట్రిక్ టన్నులు కొంటే 904 మంది రైతుల వద్ద 3385 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం ఒక్కో క్వింటాలకు వెయ్యి రూపాయల చొప్పున నష్టం భరిస్తూ జగిత్యాల నియోజకవర్గ లో 12 నుండి 15 కోట్ల వరకు రైతుల కోసం ప్రభుత్వం నష్టాన్ని భరిస్తుంది అని కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి చేతులెత్తేసిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి,పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,ధీటి రాజి రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, రాకేష్ నాయక్, సర్పంచులు బెజ్జంకి మోహన్, రాజేష్, ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు కోల శ్రీనివాస్, రాజారెడ్డి, సురేందర్ నాయక్, సింగం రమేష్, మర్రిపెల్లి శ్రీనివాస్,తలారి రాజేష్,వేణు, రాజేష్, ఇర్ఫాన్, మురళి, రాజేష్,శివ, గట్టు నవీన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిఎంజె జ్యువెలరీ షాప్ దోపిడీ కేసులో ...

**మొదటి పేజీ తరువాయి...** సిద్ధమయ్యారు.సుభోద్ సింగ్ అను చరుల సమాచారంతో రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాలకు వెళ్లి రైలులో చంద్రపూర్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు 02-05-2026 న గడ్‌చందూర్ పరిసరాల్లో ఆరు పిస్టల్స్ మరియు మ్యాగజైన్లు అందజేశారు. రఘునాథ్ కర్మాకర్ ఆయుధాలతో ధర్మపురికి తిరిగి వచ్చాడు. 03-05-2026న ఉదయం ఐదుగురు నిందితులు ధర్మపురిలో వారు ఉన్న లాడ్జ్ ఖాళీ చేసి రెండు బైక్‌ల పై బయలుదేరారు. బ్యాగులను కొండ ప్రాంతంలో దాచిపెట్టి, అక్కడే వారి బైక్ నంబర్ ప్లేట్లు మార్చి, వెలిచాల ఎక్స్ రోడ్ వద్దకి చేరుకొని అక్కడ టిఫిన్ చేసి, దోపిడీ ప్రణాళికను మరోసారి చర్చించారు.తరువాత ఉదయం 10:50 గంటలకు పిఎం జె జ్యువెలరీ షాప్‌కు చేరుకున్నారు.ప్రణాళిక ప్రకారం రాధే అలియాస్ అభయ్ కస్టమర్‌లా షాప్‌లోకి వెళ్లి పరిస్థితిని గమనించాడు. రాధే మెసేజ్ ఇచ్చిన తర్వాత మిగతా నిందితులు లోపలికి ప్రవేశించి సిబ్బంది దిని ఆయుధాలతో బెదిరించారు. నగలు దోచుకొనుచునడగా స్టాఫ్ ప్రతిఘటించ చడముతో నిందితులు వారి వద్ద ఉన్న ఆయుదాలతో స్టాఫ్ పై కాల్పులు జరిపారు.నిందితులు షాప్ నుండి పారిపోతూ వారు షాపులో దోచుకున్న ఒక ఆభరణాల బ్యాగును తీసుకుని పారిపోయారు. ఆందోళనలో మరో బ్యాగును షాప్‌లోనే వదిలివేశారు. ముందుగా నిర్ణయించిన మార్గంలో ధర్మపురికి చేరుకున్నారు.సనోజ్, రాధే అలియాస్ అభయ్, ప్రద్యుమన్ గోదావరి నది ఒడ్డున పల్సర్ బైక్‌ను వదిలి నదుచుకుంటూ నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పరార య్యారు.మరోవైపు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్ మరియు మిశ్రా ఆభరణాల బ్యాగ్‌తో అపాచీ బైక్‌పై గుండాల అడవి ప్రాంతానికి వెళ్లారు. అక్కడ తెలుపు రంగు క్రెటా కారులో వచ్చిన వ్యక్తులకు బ్యాగ్ మరియు బైక్ అప్పగించి సమీప రైల్వే స్టేషన్ ద్వారా బీహార్‌కు పారి పోయారు.సాంకేతిక నిఘా ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించారు .ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు,నకిలీ ఆధార్ కార్డులు, రూ. 51,000 ల నగదు స్వాధీనం చేసుకు న్నారు. ముగ్గురిని కోర్టులో హాజరు పరుస్తున్నారు.మిగిలిన నిందితులు మరియు దోచుకెళ్లిన ఆభరణాల కోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకొన్న వస్తువులు..నగదు -రూ.51,000/- మొబైల్ ఫోన్లు -2,సిమ్ కార్డులు - 2,నకిలీ ఆధార్ కార్డు,అరెస్ట్ చేసిన నిందితుల,వివరాలురఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీర్ సింగ్ తండ్రి లేట్ కాళిదాస్ కర్మాకర్, వయస్సు 41 సంవత్సరాలు, కులం: హిందూ లోహార్, వృత్తి: కార్ డ్రైవర్, నివాసం: మల్లిక్ పడ, సాల్పన్ గ్రామము, అసన్సోల్ సౌత్ మండల్, పాశివర్ధన్, వెస్ట్ బెంగాల్, (ఇతనిపై వివిధ రాష్ట్రాల్లో దోపిడీ, హత్య, ఆయుధ చట్టాల కింద 7 కేసులు ఉన్నాయి)రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ తండ్రి శంకర్ ప్రసాద్, వయస్సు 23 సంవత్సరాలు, కులం: యాదవ్, వృత్తి: కూలి, నివాసం: గవాల్ బిఘ గ్రామం, హిల్స మండలం, నలంద జిల్లా, బీహార్ రాష్ట్రం.(ఇతనిపై దొంగతనం, దోపిడీ, హత్య, ఆయుధ చట్టాల కింద 15 కేసులు ఉన్నాయి. మెహతాబ్ ఖాన్ మహబూబ్ ఖాన్, నివాసం.నూరుద్దీన్ రోడ్, అసన్సోల్ సౌత్ పి.యస్, పచ్చిమ్ బర్ధన్, వెస్ట్ బెంగాల్.(నేరానికి ఉపయోగించిన సిమ్ కార్డులు సరఫరా చేసిన వ్యక్తి)పరారీలో ఉన్న నిందితులు సుభోద్ సింగ్ (గ్యాంగ్ లీడర్),రాధే మిశ్రా అలియాస్ అభయ్ అలియాస్ ప్రమోద్ గోస్వామిమిశ్రా, సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్, (లాజిస్టిక్ ఏర్పాట్లు చేసిన వ్యక్తి),(ఆపరేషన్ సమన్వయకర్త),(నేరానికి డబ్బు సమకూర్చిన వ్యక్తి), (రేకీ నిర్వహించిన వ్యక్తి), (క్రెటా కారు డ్రైవర్),(గ్యాంగ్ సభ్యుడు),పోలీసుల సూచనలుకరీంనగర్ పోలీసులు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, లాడ్జ్‌లు, గెస్ట్ హౌస్ యజమానులకు కింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు:నాణ్యమైన సి సి టి వి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని నిరంతరం పర్యవేక్షించాలి.ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను నియమించి అప్రమత్తంగా ఉంచాలి.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.లాడ్జ్‌లు, గెస్ట్ హౌస్‌లు సరైన ఐడీ ధృవీకరణ తర్వాత మాత్రమే గదులు ఇవ్వాలి.నగదు, బంగారం రవాణా సమయంలో భద్రతా నియమాలు పాటించాలి.ఎమర్జెన్సీ అలారం వ్యవస్థలు, పానిక్ బటన్లు ఏర్పాటు చేయాలి.అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.కరీంనగర్ పోలీసులు శాస్త్రీయ ఆధారాలు, సి సి టి వి ఫుటేజ్, సాంకేతిక విశ్లేషణ మరియు అంతర్రాష్ట్ర సమన్వయంతో దర్యాప్తు కొనసాగు తోందని, మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

# ధాన్యం అన్లోడింగ్లో నిర్లక్ష్యం చేయవద్దు

**మొదటి పేజీ తరువాయి...** నిర్వాహకులు గన్ని సంచులు, టార్పలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలన్నారు.కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరిత గతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు.రైతులు,రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి,నిల్వ,మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు,తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి,ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు హమాలీ లను అందుబాటులో ఉంచుకొని వచ్చిన ధాన్యాన్ని దింపుకో వాలని మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లు, అధి కారులు సమన్వయం చేసుకొని కొను గోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లుల కు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీవో నరసింహారావు, సివిల్ సప్లయ్ డిఎం జితేంద్ర ప్రసాద్,తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**-కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి**

**-ధాన్యంతో వచ్చిన లారీలను మిల్లుల వద్ద 24 గంటల్లో అన్లోడ్ చేసి పంపించాలి**

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 14 :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారుల ను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుండి మండల తహసీల్దార్ల తో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పురోగతి, ధాన్యం నిల్వలు, రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగుల సరఫరా తదితర అంశాల పై అధికారులను సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడు తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని,తాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకెట్స్,నీడ,టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం లిఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసి గోదాములకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్ట్ యాజమాన్యాలు సమన్వయంతో పని చేసి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.ప్రతిరోజు కొనుగోలు వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద పారదర్శకత పాటించాలని సూచించారు.

## ధాన్యం కొనుగోలు, రవాణా, అన్లోడింగ్

# ప్రక్రియలను వేగవంతం చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్**



**చురకలు విలేకరి, కోరుట్ల, మే 14 :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా మరియు అన్లోడింగ్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ అన్నారు. గురువారం కోరుట్ల మండలంలోని జోగినపల్లి గ్రామంలోని మూడు రైస్ మిల్లులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులను సందర్శించి మిల్లులల్లో జరుగుతున్న ధాన్యం అప్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. మూడు మిల్లులలో రెండు పాయింట్ల వద్ద అన్లోడింగ్ కొనసాగుతుండగా, నిన్న రాత్రి మరియు ఈరోజు ఉదయం చేరుకున్న 6 నుండి 8 వాహనాలు వేచివున్నట్లు గుర్తించారు. మిల్లులకు చేరుకున్న ప్రతి వాహనాన్ని 15 నుండి 18 గంటల వ్యవధిలో అన్లోడ్ చేస్తున్నట్లు మిల్లర్లు, అధికారులు వివరించారు. ధాన్యం రవాణా మరియు అన్లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత మిల్లర్లకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మాధాపూర్ ఐకేపీ పీపీసీ కేంద్రం, పైడిమడుగు ప్యాక్స్ పీపీసీ కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం జోగినపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటాయని అదేవిధంగా మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్, డిప్యూటి తహసీల్దార్, ఏపిఎం, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవిని

# సన్మానించిన మైనారిటీ నాయకులు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, మే,14 :** కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన పీస్ మీటింగ్ అనంతరం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మైనారిటీ నాయకులు, కౌన్సిలర్లు, సంఘ సేవకులు పోలీస్ అధికారులను సన్మానించారు. ఇటీవల కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ఎస్సై చిరంజీవి అందిస్తున్న సేవలను కొనియాడుతూ ఆయనను కూడా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ దేశంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా పోలీస్ అధికారులు 24 గంటలు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. పట్టణాలు, గ్రామాలు, పల్లెల ప్రజల భద్రత కోసం పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. కోరుట్ల పట్టణ పరిసర గ్రామాల్లో ప్రజలు మత సామరస్యంతో కలిసిమెలిసి జీవిస్తున్నారని రాజకీయ నాయకులు కూడా లౌకికవాద భావాలతో ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తున్నారని తెలిపారు. ఒకరి పండుగలను మరొకరు కలిసి జరుపుకోవడం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం కోరుట్ల ప్రత్యేకత అని ముస్లిం మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పోలీస్ అధికారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు వారి సేవలు ఎంతో అవసరమని కొనియాడారు.

# మాజీ ఉపసర్పంచ్ సందీప్ రెడ్డి జన్మదిన వేడుకలు

**-ఉపాధి హామీ కూలీలకు పండ్లు, మజ్జిగ పంపిణీ**



**చురకలు విలేకరి, వెల్గటూర్, మే 14 :** మాజీ ఉపసర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి జన్మదిన వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని, ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు ఆయన అండగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామశివారులో పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారికి చల్లని మజ్జిగ మరియు అరటి పండ్లను పంపిణీ చేశారు. ఆడంబరాలకు పోకుండా ఇలా సామాజిక సేవా కార్యక్రమాలతో తన పుట్టినరోజును జరుపుకోవడం పట్ల స్థానికులు మరియు కూలీలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు గండ్ర ప్రతాప్ రావు,మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్,బిసి సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్,వార్డ్ సభ్యులు నక్క సురేష్,వీరా,నాని, గణి యూత్ సభ్యులు,వెలగందుల సంతోష్,లకుమల్ల సాయి, కొండ లక్ష్మీనారాయణ,గుమ్ముల అజయ్,పందిరి వెంకటేష్,కస్తూరి హరి,మ్యాకల వికాస్,ఇప్ప సిద్ధూ, ప్రేమ్ సాగర్,గుమ్ముల రాహుల్, మోతె సాయి,పోతు శ్రీకాంత్,కడియాల రాహుల్,తదితరులు పాల్గొన్నారు.

# అబ్బాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజీనామా



**చురకలు విలేకరి, గొల్లపల్లి, మే 14 :** గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు జక్కుల ధనంజయ్ కాంగ్రెస్ పార్టీకి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పనితీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వడ్ల కొనుగోలు ఐకెపి సెంటర్లలో సక్రమంగా జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు పూర్తి భరోసా ఉండేదని, ఇలాంటి సమస్యలు లేవని, ఇకపై మాజీ మంత్రి ఈశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరి ప్రజల కోసం పని చేస్తానని ధనుంజయ్ ప్రకటించారు.

# పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సత్కారం



**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, మే 14 :** ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించబడుతున్నాయని గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని జగ్గాసాగర్ గ్రామ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇటీవలే పదవ తరగతిలో ఉత్తీర్ణులైన అన్నారపు సంజన557,కొమ్ములపెల్లి హరిని543 మరియు 500 పైన మార్కులు వచ్చిన విద్యార్థులను పంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ప్రశాంత్ కుమార్, వార్డు మెంబర్ అజారుద్దీన్, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ



**చురకలు విలేకరి, ధర్మపురి, మే 14 :** ధర్మపురి పట్టణంలో ని 13వ వార్డు మరియు 12వ వార్డులలో అంగన్వాడీ కేంద్రాల్లో 13వవార్డు కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్, 12వ వార్డ్ కౌన్సిలర్ చుక్క సంధ్య భీమరాజ్ లు చిన్నారులు, గర్భిణీలు బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, కెవిఆర్ లక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎండకు ఉపాధి కూలీలు జాగ్రత్త వహించాలి



**చురకలు విలేకరి,మెట్ పల్లి రూరల్, మే 14 :** వడ గాలులతో కూడిన ఎండలకు రోజువారీగా ఉపాధి పనులకు వెళ్లే కూలీలు జాగ్రత్త చర్యలు పాటించి వడదెబ్బ నుంచి తమనుతాము రక్షించుకోవాలని సర్పంచ్ చిలివేరి విజయ అన్నారు. గురువారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో రోజువారీ ఉపాధి హామీ పనులను పరిశీలించి వంద రోజుల ఉపాధిహామీ పనులకు ప్రతిఒక్కరు హాజరు కావాలని కోరారు. అనంతరం కూలీలకు మజ్జిగ పాకెట్స్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంపంగి యమున మైసారెడ్డి, గ్రామ వార్డుసభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండగ ప్రశాంతంగా జరుపుకోవాలి

**-చట్టాన్ని చేతిలో తీసుకుంటే కఠినంగా శిక్షిస్తాం**

**-కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,మే,14 :** కోరుట్ల పోలీస్ స్టేషన్లో గురువారం బక్రీద్ పండగ సందర్భంగా శాంతి సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మెట్పల్లి డీఎస్పీ రాములు ఆదేశాల మేరకు సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బక్రీద్ పండగను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ముస్లిం సోదరులకు ఇది పవిత్రమైన పండగ అని పేర్కొంటూ, జంతువుల రవాణా సందర్భంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా శాంతియుతంగా పరిష్కరించు కోవాలని సూచించారు. అవసరమైతే వెంటనే పోలీస్ స్టేషన్కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. సోషల్ మీడియా, ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగితే ఎవరు అయినా సరే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత గుంపులుగా తిరిగి వివాదాలకు దారి తీసేలా ప్రవర్తించకూడదని సూచించారు. బక్రీద్ సందర్భంగా మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్, స్పీడ్ రైడింగ్ చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా మత పెద్దలు, రాజకీయ నాయకులు, సంఘ సేవకులు యువతకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే పండగలను ప్రశాంతం గా నిర్వహించగలమని, ప్రతి సంవత్సరం వినాయక చవితి, రంజాన్, బక్రీద్ వంటి పండగల సందర్భంగా శాంతికమిటీ సమావేశాలు నిర్వహిం చడం వెనుక ఉద్దేశం యువతకు చట్టాలు శాంతిభద్రతలపై అవగాహన కల్పించడమేనని వివరించారు. ఈద్గా కమిటీ ఉపాధ్యక్షుడు సజ్జు ముజఫర్ మాట్లాడుతూ బక్రీద్ నమాజ్కు వెళ్లే 7మార్గాలను అధికారులు అందుబాటు లో ఉంచాలని కోరారు. అలాగే జంతువుల రవాణా విషయంలో సమయం తక్కువగా ఉండటం, వాహనాల కొరత ఉండటం వల్ల కొంత ఇబ్బంది ఎదురవు తోందని, ఈ సందర్భం లో పోలీసులు కొంత మినహాయింపు ఇవ్వాలని సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవిలకు విజ్ఞప్తి చేశారు. కోరుట్ల పట్టణం, మండలం గ్రామాల నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు యువజన సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. బక్రీద్ పండగను అందరూ ఐక్యతతో, సుఖసంతోషాలతో జరుపు కోవాలని అధికారులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆవుల వధ నిషేధించబడిందని అధికారులు గుర్తుచేస్తూ, పండుగ సందర్భంలో ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ కుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ ఎం చిరంజీవి సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, వివిధ పార్టీలకు చెందిన నాయ కులు ముస్లిం మత పెద్దలు పాత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి హాజరైన

# కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, మే 14 :** కోరుట్ల మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐలాపూర్ గ్రామానికి చెందిన కోట గంగమణి-దుర్గయ్య, ధనవేని గంగామణి సమ్మయ్యసర్పరాజుపూర్ గ్రామానికి చెందిన ఒట్టే రాధ-సతీష్, జోగన్పల్లి గ్రామానికి చెందిన ఇంద్రాల నితీష్-అశోక్ల నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో కృషి చేసిన కాంగ్రెస్ పార్టీతో పాటు జువ్వాడి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, అయిలాపూర్ గ్రామ సర్పంచ్ ద్యావనపెల్లి రామకృష్ణ, నగునూరి గంగాధర్ గౌడ్, శశింధర్ రెడ్డి, పుల్లన్నగారి పుల్లారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తోట గంగాధర్, తోట నర్సయ్య, కోరుట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రాల హరీష్, మధు, మరిపెల్లి జనార్ధన్, జోగన్పల్లి ఉపసర్పంచ్ ఎల్పుల అంబేద్కర్, సైదు గంగాధర్, ఏలేటి గోపాల్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 14 :** 2026-27 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ లోని బేగంపేటలో గల హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం కొరకు షెడ్యూల్ కులములకు చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు జిల్లా నివాసులై ఉండి జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మీసేవ/ మున్సిపల్ కార్పొరేషన్/ తహసిల్దార్ ద్వారా జారీ చేయబడి ఉండాలని, అభ్యర్థుల తల్లిదం డ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 1లక్ష 50వేల రూపాయ లు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, జనన తేదీ, నివాస ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేసి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. జూన్ 1వ తేదీన డ్రా పద్ధతిన అభ్యర్థుల ను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్ అభివృద్ధి శాఖ కార్యాలయం లో పనివేళలలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**చురకలు విలేకరి,మెట్పల్లి రూరల్, మే 14 :** అతివేగంగా, అజాగ్రత్తగా కారును నడుపుతు వెల్లుల్ల గ్రామ శివారులోని బండలింగాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ద్విచకవాహనాన్ని ఢీకొట్టాడంతో బండ లింగాపూర్ గ్రామానికి చెందిన మోహన్(27) మృతిచెందినట్లు మెట్ పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బండలింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మోహన్ ఉదయం కథలాపూర్ మండలంలోని బంధువుల పెళ్లికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో గల బండలింగాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో ఈప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపారు. హసకొత్తూరు గ్రామానికి చెందిన వ్యక్తి తన కారులో మెట్లచిట్టాపూర్ మీదుగా మెట్పల్లి వైపు అతివేగంగా, అజాగ్రత్తగా కారులో వస్తు మోహన్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టగా మోహన్ తల వెనకాల భాగంలో తీవ్రంగా గాయలవడంతో వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మెట్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్లోని డ్రీమ్ల్యాండ్ హోప్ ఆసుపత్రికి తరలించరు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మోహన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి గడ్డం జనార్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారును నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి

## -జిల్లా ఎస్పీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 14 :** గోవుల అక్రమ రవాణా వంటి సమాచారం హెల్ప్‌లైన్ నంబర్ 8712537826కు అందించాలి. రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు,సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గారు హిందు సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు.గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో హిందు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో మూడు చెక్ పోస్ట్ లు ఏర్పాటుతో పాటుగా ప్రతి స్టేషన్ పరిధిలో 24/7 వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాడం జరిగిందన్నారు.పశువుల రవాణాపై 1977 నాటి గోవధ నిరోధక చట్టం, 1978 నాటి ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్స్ రూల్స్, 1960 నాటి ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ చట్టాలను కచ్చితంగా అమలు చేయా డం జరుగుతుదన్నారు.పశువుల రవాణా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని, పశు వుల రవాణాపై అనుమానాల పేరుతో రోడ్ల దిగ్బంధనలు,ఘర్షణాత్మక పరిస్థి తులు సృష్టించవద్దని సూచిం చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే రౌడీ,సస్పెక్ట్ షీట్లు కూడా తెరవబడ తాయని స్పష్టం చేశారు.గత సంవత్సరం రెండు కేసులు నమోదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.పశు వుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్ 8712537826కి లేదానోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ8712656410 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని,పశు వులను అక్రమంగా తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవడం లో ఎలాంటి రాజీ ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. సీజ్ చేసిన పశువుల కోసం జిల్లాలో 09 ఆశ్రయ కేంద్రాలు ఉన్నాయని, ఆశ్రయా కేంద్రాల వద్ద వెటర్నరీ డాక్టర్ తో పాటుగా మేత,నీరు వంటి సౌకర్యా లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీలు నాగేంద్ర చారి,శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ రవి,ఎస్.ఐ శ్రీకాంత్ హిందూ సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఘనంగా 'బడిబాట' కార్యక్రమం

## -ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన
## -మండల విద్యాధికారి కృష్ణ హరి




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 14 :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రానీ) ఎల్లారెడ్డిపేటలో 'బడిబాట' కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బంధారపు బాల్రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహరచార్యులు ముఖ్య అతిథులుగా పాల్గొని,విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులను, తల్లిదండ్రుల ను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రతి ఒక్కరూ వినియోగిం చుకోవాలని కోరారు.అర్హులైన పిల్లలందరినీబడిలో చేర్పించి, గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యత కలిగిన గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహర చార్యులు మాట్లాడుతూ,తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధనతో పాటు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజన పథకం మరియు ఇతర ప్రభుత్వ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు.అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు."బడిబాట-మన బాధ్యత" అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులను బడికి పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట విద్యాధికారి కృష్ణహరి పాఠశాల ఉపాధ్యాయ బృందం,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు తిమ్మాపూర్ సింగల్ విండో చైర్మన్‌గా

# బాధ్యతలు స్వీకరించిన సుధీర్రావు

## -చైర్మన్ గారు,,,,, చార్జి తీసుకోరు,,,, అనే శీర్షికతో చురకలు సాయంకాలం దినపత్రికలో వచ్చిన వార్త కథనానికి స్పందన



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 14 :** చైర్మన్ గారు,,,,, చార్జి తీసుకోరు, ,,,అనే శీర్షికతో చురకలు సాయంకాలం దినపత్రికలో తేది 14 -05-2026 తేదీ నా వచ్చిన వార్త కథనానికి స్పందన ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ సింగిల్ విండో అధ్యక్షులుగా సుధీర్ రావు ఎట్టకేలకు గురువారం బాధ్యతలు స్వీకరించారు,కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సింగిల్ విండో అధ్యక్షులుగా పలువురు ఈనెల 6 వ తేదీనా ఇన్చార్జి అధికారుల నుండి చైర్మన్గా బాధ్యతలు స్వీకరించినప్పటికి బుధవారం వరకు సుధీర్రావు తిమ్మాపూర్ సింగిల్ విండో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించలేదు,దీంతో చైర్మన్ గారు,,,,,,,బాధ్యతలు తీసుకోరు ,,,,,,,,అనే శీర్షికతో చురకలు సాయంకాలం దినపత్రికలో 14వ తేదీ నా వార్త కథనం ప్రచురితమైంది.ఈ వార్తా కథనాన్ని స్పందించిన సుధీర్రావు హైదరాబాద్ నుండి గురువారం హుటా హుటిన తిమ్మాపూర్ వచ్చి చైర్మన్‌గా ఇన్చార్జి అధికారి షఫీయోద్దీన్ నుండి బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన సుధీర్ రావు వైస్ ప్రెసిడెంట్ బుగ్గ కృష్ణమూర్తి శర్మను పాలకవర్గాన్ని పలువురు శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు.


చురకలు
సాయంకాలదినపత్రిక
చైర్మన్ గారు,,,,,,,చార్జి తీసుకోరు,,,,,,

## ప్రధాని నరేంద్రమోడీకి పాలాభిషేకం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే14 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిజెపి మండల నాయకుల ఆధ్వర్యంలో గౌరవ శ్రీ ప్రధాని నరేంద్ర మోడీ గారికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది నిన్నటి రోజున 14 పంటలు మద్దతు ధరలు పెంచడం ద్వారా రైతులకు శుభ పరిమాణం జై జవాన్ జై కిసాన్ రైతే రాజుగా ఆదుకునేది భారతీయ జనతా పార్టీ అది నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో రానున్న రోజుల్లో కూడా మద్దతు ధరలు రైతులను ఆదుకోవడం రైతులు రాజుగా చూడాలని ధ్యేయం నెరవేర్చే గల పార్టీ ఏదైనా ఉన్నాదంటే అది భారతీయ జనతా పార్టీ తోనే సాధ్యం ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ హరి యాదవ్ దాసరి గణేష్ ఎస్సీ మోర్చ వైస్ ప్రెసిడెంట్ ఉదుగుల యాదగిరి ప్రదీప్ రెడ్డి గంట బాలకృష్ణ నాంపల్లి ప్రశాంత్ సతీష్ దాసరి పవన్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థులకు ఫ్రూట్ కార్వింగ్‌పై శిక్షణ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 14 :** వేసవి కాలంలో విద్యార్థులు ఎండలో తిరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేసి స్కిల్స్ కు ప్రాధాన్యతను ఇచ్చింది.. అందులో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, కుట్లు అల్లికలు, డాన్స్, బేసిక్ మాథ్స్, సైన్స్, వంటి క్లాసులను ప్రత్యేక శిక్షకులచే నేర్పిస్తున్నారు.. ఇవాళ ప్రముఖ కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ డ్రాయింగ్ క్లాసులు చెప్తూ ఫ్రూట్ కార్వింగ్ వాటర్ మిలన్ పై చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు రామమనోహర్ రావు, బాలయ్య, భాస్కర్, రవీందర్, మంజుల, పద్మ,రిటైర్డ్ హెచ్ఎం మధుమాలతీ ,CRP లు చంద్రయ్య, ఉపేందర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ధాన్యం తరలించాలి

### -కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట మే 14 :** కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్, గంభీరావుపేట మండల కేంద్రం, మండలంలోని మల్లారెడ్డిపేట, ముస్తాఫానగర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం తనిఖీ చేశారు.లారీల కొరత లేకుండా వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్, కొత్తపల్లిలోని వాయుపుత్ర ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తనిఖీ చేసి.. ధాన్యం లారీలను వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు. హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. పరిశీలనలో గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం చేయవద్దు

## -పాలనాధికారి భవేశ్ మిశ్రా

**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 14** : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఆలస్యం చేయవద్దని జిల్లా పాలనాధికారి భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లా పాలనాధికారి భవేశ్ మిశ్రా,గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.మండలాల వారిగా అనుమతులు లభించిన ఇండ్లు, ప్రారంభించిన నిర్మాణాలు, అటవీ నిబంధనల వల్ల ఆగిన ఇండ్లు, తదితర




అంశాలు సమీక్షించారు. తమ పరిధిలో ఉన్న అటవీ అంశాల పరిష్కారానికి అటవీ అధికారులు కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు పరిశీలించి,అర్హత ఉన్న దరఖాస్తులను పై దశకు పంపించాలని అన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతే వెంటనే తమదృష్టికి తీసుకు రావాలని సూచించారు.అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి,ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు.స్థానిక సంస్థల అదనపు పాలనాధికారి బి.వెంకటేశ్వర్లు, ఖానాపూర్ అటవీ డివిజనల్ అధికారి రేవంత్ చంద్ర, హౌసింగ్,అటవీ అధికారులు, ఎంపీడీవో లు,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సిపిఐ ప్రతినిధి బృందం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 14** : ఎల్లారెడ్డిపేట మండలం పదిర హరిదాసు నగర్ వెంకటాపురం రాగట్లపల్లి తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి దాన్యాం కొనుగోలు కేంద్రాలవు సిపిఐ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా గురువారం సిపిఐ జిల్లా నాయకులు గుంటి వేణు ఆధ్వర్యంలో ప్రతినిధులు మీసం లక్ష్మణ్ అంజన్న బాలరాజు శంకర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికులతో అవగాహన కార్యక్రమం చేపట్టిన ఎస్పీ

**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 14** : నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్ద బెల్లాల్ గ్రామంలో మహిళల భద్రత, మాదక ద్రవ్యాలు,సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ.జానకి షర్మిల ఈరోజు నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మారుమూల గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, ముఖ్యంగా ప్రతి కుటుంబంలోని ఇంటి పెద్దలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, అలాగే మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల గురించి జిల్లా ఎస్పీ అవగాహన కల్పించారు. ఇంటి పెద్దలకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ పిల్లలకు సరైన మార్గదర్శనం చేసి, సైబర్ మోసాలకు గురికాకుండా



జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా, మైనర్ వయస్సులో వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా సూచనలు చేయగలరని జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ముఖ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ, 18 సంవత్సరాలలోపు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు .అదేవిధంగా గంజాయి,గుడుంబా, కల్తీ కల్లు వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యంతో పాటు కుటుంబాలను కూడా నాశనం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామానికి స్వయంగా వచ్చి తమతో మాట్లాడి అవగాహన కల్పించడం పట్ల మహిళలు,ఉపాధి హామీ కార్మికులు, సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం ఎస్పీ అక్కడున్న మహిళలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారు తెచ్చుకున్న సద్దిలో ఏమున్నాయి అని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.మహిళలు జిల్లా ఎస్పీతో కలిసి సెల్ఫీలు దిగారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ.జానకి షర్మిలతో పాటు,నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, డిఆర్డిఓ అధికారి విజయలక్ష్మి, ఖానాపూర్ ఇన్స్పెక్టర్ అజయ్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ వెంకట రమణ,ఎస్ఐలు,షి టీమ్ బృందం, గ్రామస్థులు,ప్రజలు, మహిళలు, 400 మంది ఉపాధి హామీ పథకం కార్మికులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ-షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 14** : నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ సంఘ భవన్ లో గురువారం కళ్యాణ లక్ష్మీ-షాది ముబారక్ చెక్కులను బీజేఎల్పీ నేత ,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డితో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ,అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

# వికలాంగుడి సమస్యపై వెంటనే స్పందించిన ఎస్పీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే,14** : జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నఅవగాహన కార్యక్రమాల్లో భాగంగా కడెం మండలం పెద్ద బెల్లాల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ.జానకి షర్మిలను,ఒక వికలాంగుడు కలిసి తన సమస్యను విన్నవించుకున్నారు.అర్జిదారుడి సమస్యను శ్రద్ధగా విన్న జిల్లా ఎస్పీవెంటనే స్పందించి,అక్కడున్న పోలీసు అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించే దిశగాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

## -కలెక్టర్ కుమార్ దీపక్

**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 14** : 2026-27విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద 1,5 తరగతులలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నాన్ రెసిడెన్షియల్ లో 1వ తరగతికి 91 సీట్లు, రెసిడెన్షియల్ లో 5వ తరగతికి 92 సీట్లు కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ నుండి జూన్ 6వ



తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రూమ్ నం.3 లోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని, దరఖాస్తు ఫారములు కార్యాలయ పని వేళలను పొందవచ్చని తెలిపారు. కుటుంబంలో ఒక అభ్యర్థికి మాత్రమే పథకం వర్తిస్తుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం (మున్సిపల్ కార్పొరేషన్/ మున్సిపల్ బోర్డ్/ మీ సేవ ద్వారా జారీ చేయబడినది), 1వ తరగతి విద్యార్థులు జూన్ 1, 2020 నుండి మే 31, 2021 మధ్య, 5వ తరగతి విద్యార్థులు 4వ తరగతి బోనఫైడ్, రేషన్ కార్డు/ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించాలని, మీ సేవ ద్వారా జారీ చేయబడిన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలు, పాఠశాల నుండి గత సంవత్సరం మార్కుల జాబితా నకలు ప్రతులు (5వ తరగతి వారికి), అన్ని నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారి చే ధ్రువీకరణ సంతకం చేయించి సకాలంలో సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ప్లాస్టిక్ విక్రయాలు వద్దు

## -హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ బి కిషన్

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 14** : హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని, వ్యాపారులు ప్లాస్టిక్ వస్తువులు విక్రయించొద్దని మున్సిపల్ కమిషనర్ బి కిషన్ కోరారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కారణంగా అనారోగ్యంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. ప్లాస్టిక్ గ్లాసులు ప్లేట్లు డ్రైనేజీల్లో కనిపిస్తున్నాయని,తద్వారా డ్రైనేజీలో నీరు ప్రవహించకుండా నిలిచిపోతుందని తెలిపారు.ప్లాస్టిక్ ఎక్కువకాలం భూమిపై ఉండిపోతుందని తద్వారా పర్యావరణానికి జంతువులకు పశువులకు హాని




కలుగుతోందని గుర్తు చేశారు. ప్లాస్టిక్ వినియోగశీ పూర్తిగా తగ్గించేందుకు వ్యాపారులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ ను మాత్రమే ఉపయోగించాలని కోరారు. ఇకపై ప్రతినిత్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు.కూరగాయల వ్యాపారులు ప్లాస్టిక్ వాడొద్దని సూచించారు.కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్,పర్యావరణ ఇంజనీర్ వినయ్, శానిటరీ జవాన్లు ప్రతాపరాజు,ఆర్ సుధీర్,పాలకుర్తి అనిల్, ఆరెల్లి రమేష్,తూముల కుమార్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

## నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**చురకలు విలేకరి, గొల్లపల్లి, మే 14 :** మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన సూచనలు సలహాలు తెలియజేస్తారని, అలాగే రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులు ఏ పంటలు సాగు చేయాల్సిన పంట వివరాలను తెలియజేస్తారన్నారు. పంట మార్పిడి యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## డిఆర్‌డిఓగా ఇన్చార్జి డిప్యూటీ సిఇవోగా పదవి బాధ్యతలు చేపట్టిన కుందారపు లక్ష్మీనారాయణ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 14 :** రాజన్న సిరిసిల్ల జిల్లా డిఆర్‌డి ఓగా ఇన్చార్జి డిప్యూటీ సిఇవోగా గురువారం కుందారపు లక్ష్మీనారాయణ పదవి బాధ్యతలు స్వీకరించారు.పదవి బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా కుందారపు లక్ష్మీనారాయణకు జిల్లాలోని ఎంపీడీవోలు పుష్పగుచ్ఛములతో స్వాగతం పలికి,శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు

**-ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ**



**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల మే 14 :** కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరియు రైస్ మిల్లును జిల్లా ఎస్పీ సందర్శించి విధుల్లో ఉన్న అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా మరియు సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు.అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు.దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఎస్పీ గారి వెంట సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.



# వరి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 14 :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని సుముఖ గోదాము, మండల కేంద్రంలోని జయలక్ష్మి రైస్ మిల్ లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించు కోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియ అనుసంధానంగా జరగాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. రైస్ మిల్లర్ల యజమానులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని తెలిపారు.

### నీట్ పరీక్ష రద్దును నిరసిస్తూ ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో

# ప్రధాని మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి దిష్టిబొమ్మల దహనం



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 14 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ గురువారం ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను ఎన్ఎస్ యుఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఆదర్శ వర్ధన్ రాజు ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. నీట్ పేపర్ లీకేజీ తో 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. మోడీ పాలనలో వరుసగా పేపర్ లీకులు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం లో గత పదేళ్లలో 89 పేపర్ లీకులు జరిగాయని, 48 సార్లు మళ్లీ పరీక్షలు నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న మోడీ ప్రభుత్వం దేశ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేశామని చెప్పారు. వీరిద్దరూ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ముద్దం శివప్రసాద్, ఉపాధ్యక్షులు చిలుముల సాయి కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామిళ్ళ ప్రదీప్, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి మండల ఉపాధ్యక్షులు కాంపల్లి పవన్, ఎన్ ఎస్ యు ఐ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు హాజీ బాబా, కన్నెపల్లి మండల అధ్యక్షులు ప్రణయ్, భీమిని మండల అధ్యక్షులు ఏటకారి రాజు, తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి కోయిల్ , సజ్జు, దీక్షిత, సోను తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ డిపార్ట్మెంటల్ కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 14 :** అంకిత భావంతో విధులు నిర్వహించాలని సింగరేణి సంస్థ రామగుండం -3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావు అన్నారు.సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుండి నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా ఆర్జీ-3 డ ఏ.పీ.ఏ ఏరియా యూనియన్ నాయకులు, ఉత్తమ ఉద్యోగులు, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు గురువారం మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం కార్యక్ర నిర్వహణ పై సమీక్ష నిర్వహించి సంస్థ స్థితిగతులతో పాటు, ఏరియా ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన కల్పించి, ఉద్యోగులకోసం నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు తెలియజేయడం జరిగింది. ఈసందర్భంగా జి.యం లు మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమయపాలన పాటిస్తూ,అంకిత భావంతో పని చేసి,పని గంటలను వృధా చేయకుండా విధులు నిర్వహించాలని అన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యత తో కూడిన విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సక్రమంగా పని చేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ,సంస్థ అభివృద్ధికి తోడ్పడాల న్నారు. ఏ ఇతర ప్రభుత్వ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కావున ఉద్యోగులందరూ దీనిని గమనించి, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.భవిష్యత్తులో కంపెనీ లక్ష్యాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రూపొందించే ప్రణాళికలకు అనుగుణం గా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. సంస్థ పై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకానివమ్ము చేయకుండా చూడటం మనందరి బాధ్యత అని అన్నారు.ఈ మల్టీ డిపార్ట్మెంట్ కార్యక్ర మాలు అన్ని గనుల, విభాగాల లో దశల వారీగా అనగా 18-05-2026 న ఓసిపి-2 ఉపరితల నందు, 19-05-2026, 20-05-2026 ఓసిపి -1 ఉపరితల గని నందు, 21-05-2026 అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ నందు, 22-05-2026 వివిధ విభా గాల వారికి మూడు షిఫ్ట్ లలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించ బడునని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు,ప్రాతినిధ్యసంఘాల నాయకులు యం.రామ చంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్లు సుధాకర్ రెడ్డి, యాదయ్య, ఎస్టోటుజియలు బి.వి. సత్య నారాయణ, బండి సత్య నారా యణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్, ప్రవీణ్ వి ఫొంటింగ్,ఐఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ,ఇంచార్జ్ పర్సనల్ విభాగాధి పతి వి.సునీల్ ప్రసాద్,ఇతర విభాగాధి పతులు,అధికారులు, యూనియన్ నాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## బ్యాంకులు,ఏటీఎంల వద్ద
# పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

**-ప్రతి బ్యాంక్, ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరాలు,అలారం సిస్టం ఏర్పాటు చేయాలి**
**-సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 14 :** బ్యాంకు అధికారులు, సిబ్బంది పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారి ఆదేశాల మేరకు ఈరోజు సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఏటీఎం కేంద్రంలో సెక్యూరిటీ గార్డు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలని తెలిపారు.దోపిడీ లేదా అనుమానాస్పద ఘటనల సమయంలో సిబ్బంది ఎలా స్పందించాలనే విషయంపై ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. బ్యాంకులోకి వచ్చే వ్యక్తులను తనిఖీ చేసేందుకు ప్రవేశ ద్వారం వద్ద DFMD (డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్) ఏర్పాటు చేయడంతో పాటు, గార్డులకు HHMD (హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్) అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.రాత్రి సమయల్లో ఏటీఎంలలో నగదు తక్కువ ఉండేలా చూసుకోవాలిని,ఏటీఎంలలో నగదు నింపే సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందిస్తే, ఆ ప్రాంతంలోని బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు ప్రతి బ్యాంకు అధికారికి, సిబ్బందికి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ఫోన్ నంబర్లు తప్పనిసరిగా తెలిసి ఉండాలని సూచించారు.సెక్యూరిటీ గార్డును బ్యాంకు లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ, వారి పూర్తి వివరాలు, ఫోటోలు బ్యాంకు వద్ద భద్రపరచాలని తెలిపారు. కొత్తగా లేదా తాత్కాలిక ప్రాతిపదికన నియమితుల య్యే సిబ్బంది విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చాలా దొంగతనాల్లో నిందితులు సీసీ కెమెరాలపై స్ప్రే చేసి వాటిని పనిచేయ కుండా చేయడం,DVRలను దొంగిలించడం లేదా ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అందువల్ల DVRను కనిపించని సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.బ్యాంకుల లోపల కానీ, పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. సమావేశంలో సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా కొడారి మల్లేష్ యాదవ్ ఎన్నిక

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, మే 14 :** పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మహావాది సతీష్ కుమార్, గౌరవాధ్యక్షులుగా బొల్లవరం విజయానందరావు, ఉపాధ్యక్షులుగా జబ్బార్ ఖాన్, వెల్మరెడ్డి శ్రీనివాస రెడ్డి, కోశాధికారిగా చేరాల రవీందర్, సహాయ కార్యదర్శులుగా చిప్ప రాజేష్, గిరివేణి రాకేష్, ప్రచార కార్యదర్శిగా చెలుకల యుగంధర్, కార్యవర్గ సభ్యులుగా కాశీపేట శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, మాదేశి శ్రావణ్, ఆకుల రాజు, రామడుగు సాయి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా




అధ్యక్షుడు కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్ మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో ఏర్పాటై అంచెలంచెలుగా ఎదుగుతున్న డివిజన్ ప్రెస్ క్లబ్ ఇదే స్థాయిలో మంథని, కమాన్‌పూర్, ముత్తారం మండలాల స్థాయిలో గొప్ప పేరుతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సీనియర్ పాత్రికేయుడు అక్కల నారాయణ మాట్లాడుతూ నూతన కమిటీ పాత్రికేయులకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.సంవత్సర కాలం క్రితం ఏర్పాటైన మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులందరి కృషితో ముందుకు సాగుతుందని తెలిపారు. ఒక సంవత్సరం సమయంలో కొన్ని పొరపాట్లు జరిగినా వాటిని అధిగమించి, గతంలో ఎదురైన ఆటుపోట్లు తట్టుకొని ఇకపై అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా మెజారిటీ సభ్యుల అభిప్రాయాల మేరకు క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మెడగొని రాజమౌళి గౌడ్, మల్యాల దేవేందర్, అనుము వీరస్వామి, ఎగోలపు సంతోష్ గౌడ్, అమ్ము శ్రీనివాస్, కాసర్ల శంకర్, ఎండి సుభాన్, రావుల రాజ్‌కుమార్, మంథని లక్ష్మణ్, మాటేటి కుమార్, సడవలి, కాసు తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నగునూరి నర్సాగౌడ్

**-ధర్మపురి అధ్యక్షులుగా చిలుముల లక్ష్మణ్**
**-ఉత్తర్వులు జరిచేసిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**





**జగిత్యాల ప్రతినిధి,మే 14 :** ధర్మపురి నియోజకవర్గంలోని పలు మండలాలకు నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, గొల్లపల్లి, పెగడపల్లి మండల పార్టీ అధ్యక్షులను నూతనంగా నియామకామయ్యారు. ధర్మపురి మండల పార్టీ అధ్యక్షులుగా కమలాపూర్ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్,సంగనబట్ల దినేష్ స్థానంలో బుగ్గారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నగునూరి నర్సాగౌడ్ ఇప్పటి వరకు పనిచేసిన వేముల సుభాష్ స్థానంలో నియమించారు. పెగడపల్లి అధ్యక్షులుగా నర్సగౌడ్ కడారి తిరుపతి ఇప్పటివరకు బుర్ర రాములు స్థానంలో, ఎండపల్లి గెల్లు శేఖర్, గొల్లపల్లికి రాపెల్లి గంగమ్మ నిశాంత్ రెడ్డి స్థానంలో పీసీసీ అధ్యక్షులు నియమించారు.నర్సాగౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా సోషల్ మీడియా వేదికగా పార్టీ కార్యక్రమాలను సంక్షేమాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియపరుస్తూ అందుబాటులో ఉంటారు. నర్సా గౌడ్ తండ్రి గతంలో ఎంపీటీసీగా పని చేశారు అప్పటినుండే నర్సా గౌడ్ రాజకీయాల్లో చురుకుగా పని చేస్తూ ప్రజల్లో తనకంటూ పేరు తెచ్చుకొని తనదైన శైలిలో ముందుకెళు న్నారు.

# రోడ్డెక్కిన రైతన్న



**-తప్పా, తాలు నెపంతో కట్టింగ్ చేయవద్దని డిమాండ్**

**చురకలు విలేకరి, బీర్పూర్,మే 14 :** బీర్పూర్ మండలంలోని తుంగూరు గ్రామంలో గురువారం రైతులు ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పాత రమేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అలస్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవ్వడంతో నెల రోజుల తూకం చేయక, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపడం లేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికార యంత్రాంగం రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టకపోవడంత శోచనీయ మన్నారు. ధాన్యం రైస్ మిల్లుకు చేరే వరకు రైతుదే అంటూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.తప్పా,తాలు పేరుతో బస్తాకు రెండు, మూడు కిలోలు ఎక్కువతూకం వేయడం రైతులను మోసం చేయడమేనన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాల ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నారపాక అశోక్, సామల గంగాధర్, సీపతి రమేష్, ఆడెపు నర్సయ్య, గర్షకుర్తి రమేష్, రైతులు ఉవె ఎస్ రెడ్డి, అప్పాల జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారులు సూచించిన
# పంటలు మాత్రమే వేయాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 14 :** వ్యవసాయ అధికారులు సూచించిన పంటలను మాత్రమే రైతులు వేయాలి అని జగిత్యాల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అర్చన అన్నారు. గురువారం కమాన్ పూర్ మండలం నాగారం గ్రామంలో వ్యవసాయ కళాశాల, జగిత్యాల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం గురువారం, నాగారం గ్రామంలో రైతు వేదిక వద్ద నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ టి. అర్చన, అసిస్టంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగా, పిల్లి పెసర, అదేవిధంగా జీవన ఎరువులు, కోళ్ళ ఎరువు, వర్మీ కంపోస్టు లు వేయడం వలన నేల సరవంతంగా అయి నేల ఆరోగ్యం గా అవుతుంది అని రైతులకు సూచించారు. రసాయనిక మందులు తక్కువగా వాడాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి. గిరి రామక్రిష్ణ మాట్లాడుతూ మార్కెట్ లో డిమాండ్ ఉన్న వరి రకాలు అయినటు వంటి తెలంగాణ సోనా, కూనారం వరి -2, బిపిటి, డబ్ల్యూ జి ఎల్ -44 (సిద్ధి) మరియు జైశ్రీరామ్ లాంటి వారి రకాలను ఎక్కువగా పండించాలి అని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారి గిరి. రామక్రిష్ణ, ఏ ఈ ఓ శ్వేత, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.